## పచ్చలనడ్కుడలో చోరీ

వేల్పూర్, మే 8: పచ్చలనడ్కుడలో బుధవారం రాత్రి ఆర్మూర్ రుక్మాబాయి ఇంట్లో దొంగతనం జరిగింది. ఎస్సై సంజీవ్ కథనం మేరకు.. రుక్మాబాయి జీపీ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నది. ఇంటికి తాళం వేసి ఆమె తన కోడలితో జిల్లా దవాఖానకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం ఆమె ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో జీపీ సిబ్బంది గమనించి ఆమెకు ఫోన్‌లో సమాచారం అందించారు. ఆమె వచ్చి చూడగా బీరువాలోని బంగారం ఆభరణాలు, నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. 16 తులాల బంగారం, రూ.25 వేల నగదు దోచుకెళ్లినట్లు బాధితురాలు తెలిపింది. ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చోరీకి గురైన సెల్‌ఫోన్లు రికవరీ

శక్కర్‌నగర్, మే 8: బోధన్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో చోరీకి గురైన సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు రికవరీ చేశారు. 11 సెల్‌ఫోన్లను గురువారం బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ వెంకట నారాయణ, ఎస్సై భాస్కరాచారి, సిబ్బంది బాధితులకు అందజేశారు.

## అంతర్రాష్ట్ర ధాన్యం చెక్ పోస్టు తనిఖీ

రెంజల్, మే 8: మండలంలోని కందకుర్తి సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టును తనిఖీ చేసినట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ గురువారం తెలిపారు. గత నెలలో ప్రారంభమైన చెక్ పోస్టు వద్ద వచ్చిపోయే వాహనాల నమోదు రిజిస్టర్‌ను తహసీల్దార్ తనిఖీ చేశారు.

## అదనపు పోస్టులు మంజూరు చేయాలి

ఖలీల్‌వాడి, మే 8 : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎస్‌ఏ తెలుగు, హిందీ, ఉర్దూ అదనపు పోస్టులు మంజూరు చేయాలని డీఈవో అశోక్‌కు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా ప్రతినిధులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల విద్యాధికారులకు ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితారాణా ఆధ్వర్యంలో ఎన్‌సీహెచ్‌ఆర్‌డీలో మూడు రోజుల పాటు సమావేశం నిర్వహించగా జిల్లా ఖ్యాతిని చాటి చెప్పి, మూడు విభాగాల్లో అవార్డులు అందుకున్నందుకు డీఈవోను సన్మానించారు. జమీలుల్, రమణాచారి, కృపాల్‌సింగ్ పాల్గొన్నారు.

## బధిరుల పాఠశాలలో ప్రవేశాలు

కరీంనగర్ కలెక్టరేట్, మే 8: 2025–26 విద్యాసంవత్సరానికి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కమల ఉదయ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 8వ తరగతి వరకు ఆంగ్లమాధ్యమంలో, ఒకటి నుంచి పదోతరగతి వరకు తెలుగు మాధ్యమంలో ప్రవేశాలు కల్పిస్తున్నామని, 6 నుంచి 14 ఏండ్లలోపు బధిర బాల, బాలికలు మాత్రమే అర్హులని వెల్లడించారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లోని బాలబాలికలకు మాత్రమే ప్రవేశాల్లో ప్రాధాన్యత కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వసతి గృహ సౌకర్యం, పాఠ్య, నోటు పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌తో పాటు భోజనం, విద్య ఉచితంగా అందజేయనున్నట్లు స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, టీసీ, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా ఉన్న విజయపురికాలనీలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాలకు 9000013639 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# ఇండియన్ ఆర్మీకి సెల్యూట్



వేల్పూర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న యువజన సంఘాల సభ్యులు

ఖలీల్‌వాడి/వేల్పూర్/భీమ్‌గల్/శక్కర్‌నగర్, మే 8: మే 8 : పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడికి ప్రతీకారంగా ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేపట్టడంపై సర్వత్రా సంతోషం వ్యక్తమవుతున్నదని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీశ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సంస్థ కార్యాలయంలో వారు గురువారం మాట్లాడారు. 9 ఉగ్రశిబిరాలపై దాడులు చేసి సుమారు 80 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టడం పహల్గాం మృతులకు నిజమైన నివాళి అన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవ ర్యాలీని గురువారం భీమ్‌గల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భారత సైన్యానికి మద్దతుగా బోధన్ పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైనికులు మంగళవారం రాత్రి జరిపిన దాడిలో పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులు మృతి చెందడంతో వారికి మద్దతుగా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన వేల్పూర్ గ్రామానికి చెందిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామంలోని వివిధ యువజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇండియాలో ఉంటూ పాకిస్తాన్‌కు మద్దతుగా పోస్టు పెట్టిన వ్యక్తిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 'మండల కేంద్రంలోని జంబి హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తే డబ్బులు ఖర్చు తప్ప.. ఒరిగేదేమీ లేదంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ముగిసిన యూనిసెఫ్ బృందం క్షేత్ర పర్యటన

ఖలీల్‌వాడి, మే 8 : స్పెషల్ సప్లమెంటరీ ఫీడింగ్‌లో భాగంగా రెండో దశలో నిజామాబాద్ జిల్లా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైనందున యూనిసెఫ్ బృందం జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించింది. బుధవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బృందం సభ్యులు డాక్టర్ ఖ్యాతి తివారీ, రేషా నికుంజు దేశాయి, నర్సింహారావు పలు వివరాలను సేకరించారు. గురువారం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రాలు, తిర్మన్‌పల్లి, గన్నారంలో పోషకాహార లోపంతో బాధపడే సామ్, మామ్ చిల్డ్రన్స్‌ను పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని సందర్శించారు. జిల్లా ఉప వైద్యాధికారి తుకారాం రాథోడ్‌తో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు.

## గుండెపోటుతో మాజీ ఉప సర్పంచ్ మృతి

ధర్పల్లి, మే 8 : మండలంలోని సీతాయిపేట్ గుడితండా మాజీ ఉపసర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు దారావత్ ఎంజ్యానాయక్(40) గుండె పోటుతో మృతి చెందాడు. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంజ్యానాయక్‌కు బుధవారం అర్ధరాత్రి గుండెపోటు రాగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య హంబి, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## ఆదర్శ కళాశాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్

జక్రాన్‌పల్లి, మే 8 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ సుధారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఈ నెల 26న కళాశాలలోని నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తామని తెలిపారు. సర్టిఫికెట్ల ధ్రువీకరణ, ప్రవేశప్రక్రియ ఈ నెల 27 నుంచి 31 వరకు పూర్తవుతుందని పేర్కొన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరిట్, రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

# తగిలేపల్లిలో శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ



శివాజీ మహారాజ్‌కి పూజలు చేస్తున్న పిట్ల కృష్ణ మహారాజ్

వర్ని, మే 8 : ధర్మ స్థాపన కోసం పోరాడిన వీరుడు శివాజీ మహారాజ్ అని మల్లారం పీఠాధిపతి పిట్ల కృష్ణ మహారాజ్ అన్నారు. మండలంలోని తగిలేపల్లి గ్రామానికి చెందిన బక్క రాములు– భారతి కుమారుడు బక్క వినయ్ జ్ఞాపకార్థం గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. గురువారం నిర్వహించిన ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిట్ల కృష్ణ మహారాజ్ మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో ధర్మాన్ని బోధించాలనిసూచించారు. చనిపోయే వరకు శివాజీ మహారాజ్ ధర్మం వైపు నిలబడ్డారని అన్నారు. అనంతరం పోచారం మాట్లాడుతూ.. యువకులు శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు గుజ్జ శంకర్, తోట శంకర్, మైసం శ్రీనివాస్, దత్తు గౌడ్, అల్లం సాయిలు, బాగా గౌడ్, గైని గోపి, మాస్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కంఠేశ్వర్, మే 8 : లైసెన్స్‌డ్ ల్యాండ్ సర్వేయర్ల శిక్షణ కోసం ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు మీ సేవ కేంద్రాల్లో ఈనెల 17లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. లైసెన్స్ సర్వేయర్‌గా ఎంపికైన వారికి నెలకు సుమారు రూ. 30 వేలకుపైగా ఇస్తారని, జిల్లా కేంద్రంలో ఈనెల 26 నుంచి జూలై 26 వరకు శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ ముగింపులో పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు ప్రభుత్వ సర్వేయర్ కింద 40 దినాల పాటు శిక్షణలో భాగంగా అప్రెంటిస్‌షిప్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అప్రెంటిస్‌షిప్ శిక్షణ పూర్తయిన తర్వాత లైసెన్స్ పొందడానికి డిపార్ట్‌మెంట్ నిర్వహించే అసెస్‌మెంట్ టెస్ట్‌లో అభ్యర్థులు ఉత్తీర్ణులు కావాల్సి ఉందని తెలిపారు. అసెస్‌టమెంట్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన తర్వాత అభ్యర్థికి లైసెన్స్ ఇస్తారని పేర్కొన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 17 లోగా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

రుద్రూర్, మే 8: మండలానికి ప్రభుత్వం 200 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో ఉన్న గ్రామాలు అక్బర్‌నగర్–15, అంబం–15, చిక్కడ్‌పల్లి–15, కొందాపూర్–15, రాయకూర్–15, రాయకూర్ క్యాంపు–20, రాణంపల్లి–20, రుద్రూర్–50, సిద్ధాపూర్–15, సులేమాన్‌నగర్–20 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. త్వరలో లబ్ధిదారులను ఎంపిక చేసి పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

## గర్భిణిని ఇంట్లోంచి గెంటేసిన భర్త

వినాయక్‌నగర్, మే 8: మూడు నెలల గర్భిణిని ఆమె భర్తతో పాటు అత్త, మరిది, తోటి కోడలు కలిసి వేధించి ఇంట్లోంచి బయటకు గెంటివేశారని, బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. బండారి లక్ష్మి వివాహం నగరంలోని వినాయకనగర్‌కు చెందిన తడక శ్రీకాంత్‌తో జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రస్తుతం మూడు నెలల గర్భిణి అయిన లక్ష్మిని ఆమె భర్త శ్రీకాంత్‌తో పాటు అత్త శోభ, మరిది హరికాంత్, అతని భార్య కలిసి ఈనెల 6న ఇంట్లో నుంచి గెంటివేశారు. అందరూ కలిసి లక్ష్మిపై దాడి చేశారు. గాయపడిన ఆమెను చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. బాధితురాలి తల్లి పి.సువర్ణ నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. లక్ష్మిపై దాడి చేసిన ఆమె భర్త శ్రీకాంత్‌తోపాటు ఆయని తల్లి, తమ్ముడు, తమ్ముడి భార్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఫోర్త్ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. లక్ష్మిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా మహిళా సంఘం నాయకులు సుజాత, వనిత, కళా, స్వప్న డిమాండ్ చేశారు. దవాఖానలో బాధితురాలని పరామర్శించారు.

## దివ్యాంగులకు వీల్‌చైర్ల అందజేత

ఖలీల్‌వాడి/కంఠేశ్వర్, మే 8 : జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో 8 మంది దివ్యాంగులకు వీల్‌చైర్లను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అధ్యక్షుడు లోక రమణారెడ్డి హాజరై మాట్లాడారు. స్నేహ సొసైటీ దివ్యాంగులను గుర్తించి, వారికి అవసరమైన సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, గౌరీ శంకర్, ప్రిన్సిపాల్ జ్యోతి, రంజిత్‌సింగ్ చౌహాన్, చంద్రశేఖర్, దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని బర్కత్‌పుర రోటరీ కార్యాలయంలో రోటరీ క్లబ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్, రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైవ్ సిటీ షార్ ప్రాజెక్టు వారి సహకారంతో వీల్‌చైర్లను అందించినట్లు అధ్యక్షుడు బెరెల్లి విజయరావు తెలిపారు. ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ గవర్నర్ జ్ఞానప్రకాశ్ హాజరై మాట్లాడుతూ దివ్యాంగులు మానసిక ధైర్యం కోల్పోవద్దని, మనోధైర్యంతో ముందడుగు వేయాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఆర్.గంగారెడ్డి, కార్యనిర్వహణాధికారి గోవింద్, అశోక్, రాజేశ్వర్, శ్రీకాంత్, శ్రీరామ్ సోనీ, గణేశ్, శ్యాం అగర్వాల్ పవన్‌పాండే, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా హెన్రీ డ్యూనంట్ జయంతి

ఖలీల్‌వాడి, మే 8 : ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలాసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనంట్ జయంతిని జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ భవనంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బూస ఆంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ జిల్లా ప్రతినిధులు రాజశేఖర్, రవీందర్, శ్రీశైలం, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## 31లోగా సెమిస్టర్ ఫీజు చెల్లించాలి

ఖలీల్‌వాడి, మే 8 :అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 31 చివరి తేదీ అని ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ రంజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.500 అపరాధ రుసుముతో జూన్ 5 వరకు చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 20 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## తల్లీ కొడుకు అదృశ్యం

సిరికొండ, మే 8: మండలంలోని చీమన్‌పల్లి గ్రామ పరిధిలోని జినిగ్యాలకు చెందిన కొమ్ము జలంధర్ భార్య కొమ్ము రేవతి(24), వారి కొడుకు శ్రేయాన్స్(4) అదృశ్యమైనట్లు ఎస్సై ఎల్.రామ్ తెలిపారు. రేవతి ఏప్రిల్ 30న ఇంట్లో గొడవ పడి వెళ్లిపోయిందని, ఎంతగాలించినా ఆమె ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. భర్త జలంధర్ గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## హైదరాబాద్‌కు తరలిన నాయకులు

మోర్తాడ్/సిరికొండ, మే 8: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన ఐక్య రైతుసంఘం నాయకులు గురువారం ఉదయం తరలివెళ్లారు. హైదరాబాద్ వెళ్లిన వారిలో సారా సురేశ్, కిషన్, అశోక్, బాలయ్య, దయాల్‌సింగ్, దర్శన్‌సింగ్, శ్రీనివాస్, గంగపోశక్క, పద్మ తదితరులు ఉన్నారు. సిరికొండ మండలం నుంచి హైదరాబాద్ ధర్నాకు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు పిట్ల రామకృష్ణ, నాయకులు బయల్దేరారు.

## రేపటి నుంచి శిక్షణ తరగతులు

వేల్పూర్, మే 8: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల కోసం ఈనెల 10 నుంచి 24 వరకు మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈవో రేణుక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, డ్యాన్స్ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు క్లాసులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## భోజనాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు



రోగులకు అందజేసిన భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బోధన్, మే 8: బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో రోగులకు నాణ్యమైన భోజనాలు అందించాలని జిల్లా డైట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానను డైట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీచేశారు. ఈ సందర్భంగా దవాఖాన ఆవరణలోని వంటగదిలో ఆహార పదార్థాలను వారు పరిశీలించారు. కిచెన్‌లో ఉన్న వంట సామగ్రిని రికార్డులను పరిశీలించారు. అనంతరం దవాఖానాలోని ఇన్ పేషెంట్లకు అందించిన భోజనాలు పరిశీలించారు. వారిని భోజనాల విషయంలో ఆరా తీశారు. మెనూ ప్రకారమే భోజనాలు అందించాలని, నాణ్యమైన భోజనాలు అందించాలని, వీటిని స్థానికంగా అందుబాటులో ఉండే అధికారులు నిత్యం పర్యవేక్షించాలని పోగ్రాం అధికారి డాక్టర్ వెంకటేశ్, చీఫ్ సూపర్‌వైజర్ నారాయణ, దవాఖాన సూపర్‌వైజర్ రవికుమార్, నర్సింగ్ కళాశాల సూపరింటెండెంట్ ప్రమీల, సిబ్బంది ఉన్నారు.

# ఎస్సెస్సీ టాపర్లకు అభినందన



బెజ్జోరా ఎస్సెస్సీ టాపర్లను సన్మానిస్తున్న డీఈవో అశోక్



పొతంగల్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సన్మానం..

భీమ్‌గల్/పొతంగల్, మే8: భీమ్‌గల్ మండల ఎస్సెస్సీ టాపర్లను గురువారం జిల్లా విద్యాధికారి అశోక్ సన్మానించారు. మండలంలోని బెజ్జోరా గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మండల స్థాయిలో 1, 2, 3వ స్థానాల్లో నిలిచారు. వారు జిల్లా స్థాయిలో 2, 3వ స్థానాల్లో నిలిచారు. పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు 560కి పైగా మార్కులు సాధించారు. 22 మంది విద్యార్థులకు అందరూ 500కుపైగా మార్కులు సాధించారు. విద్యార్థులతోపాటు పాఠశాల ఉపాధ్యాయులను డీఈవో అభినందించారు. పొతంగల్ జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులను సామాజిక సేవ కర్త ఎంఏ హకీం సత్కరించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్, హెచ్‌ఎం సాయిలు, నాయకులు ఏజాజ్ ఖాన్, షేరు, రాములు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## 12న 'చలో మెట్‌పల్లి'




కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు

ఆర్మూర్‌టౌన్, మే8: ఈనెల 12న చలో మెట్‌పల్లి కరపత్రాలను ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్ భవన్‌లో గురువారం అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు ఈత్వార్ పేట్ లింగన్న మాట్లాడుతూ బుద్ధ పూర్ణిమ సందర్భంగా మెట్‌పల్లిలో మహాసభ, ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా గద్దర్ కూతురు వెన్నెల, కవి జయరాజ్ మాస్టర్ జీ హాజరవుతారని తెలిపారు. అనంతరం ఆర్మూర్ మండల అంబేద్కర్ యువజన అధ్యక్షుడిగా పింజ సుదర్శన్, కార్యదర్శి కొత్తం పూర్ణ చందర్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

## జవాన్‌కు నివాళి..




జవాన్‌కు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ఆర్మూర్‌టౌన్, మే8: జమ్మకశ్మీర్లో జరిగిన సీజ్ ఫైర్ కాల్పుల్లో వీర మరణం పొందిన సచిన్ యాదవ్ వనండే మృతికి సంతాపంగా ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం న్యాయవాదులు రెండు నిమిషాల మౌనం పాటించారు. మంగళవారం ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసి పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పిన భారత ఆర్మీకి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అధ్యక్ష, కార్యదర్శులు జెస్సు అనిల్, గటడి ఆనంద్, చైతన్య, కృష్ణపండిత్, చిలుక కృష్ణయ్య, విప్లవ కిరణ్ పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

It is to inform and cautioned to the general public my client Smt. Koyyala Gangubai alias Koyyala Pedda Gangubai, W/o: K.Pedda Gangaram (Late), Age: 89 Years, Occ: Agriculture, R/o. H.No: 3-58, Perkit (Village), Armoor Mandal, Nizamabad Dist, Telangana is the original owner and peaceful possessor of "All that the agricultural land bearing Survey No: 436/3 Admeasuring Acre. 0.08 1/2 Guntas located at: Perkit (Village), Armoor Mandal, Nizamabad Dist, Telangana, Bounded By: North: Vishaka Colony, South: Canal Road, East: Plot of Koyyala Nadipi Gangaram West: Plot of Donda Rajalingam,(Herein after referred as Schedule Property), as such my client devolved the schedule property as a legal heir Vide Patta Pass Book No: 73X438430 and Ttitle Deed No: 73X450882 issued by the Tahsildar Armoor, further the said schedule property was converted into residential house site plots vide Nala certificate No: A1/1344/2018, Dated: 29/05/2018, issued by R.D.O Armoor, as matter stood thus my clients elder daughter husband Sri Thogalla Sagar teacher advise my client to execute gift deed regarding the schedule property in favor her two natural daughters stating that my client is 89 years old aged if any unforeseen event happens it is difficult her daughter to adjudicate the legal consequences, as such my client has believed my clients elder daughter husband Sri Thogalla Sagar teacher words and she intended to execute the gift deed regarding the schedule property in favor of her two natural daughters, more over my client blindly believed my clients elder daughter husband Sri Thogalla Sagar teacher words and handed over to look after the documentation work as such my client elder daughter husband Sri Thogalla Sagar teacher having ill motive without the knowledge of my client he prepare three documents vide No: 3869/2018, 3870/2018, 3871/2018 in this Documents No: 3869/2018, 3870/2018 are the gift deed and other Document No: 3871/2018 is sale deed executed jointly in favour of his name and his second wife namely Smt. Thogalla Premalatha without paying any sale consideration with mala-fide intention to grab the property more over the original documents are in the custody of the said Sri Thogalla Sagar teacher as matter stood thus the matrimonial disputes arose between my daughter and my son-in-law regarding performing the second marriage without obtaining the divorce and without the knowledge of my client daughter in that connection my client have checked the said documents recently then she have come to know that her elder son-in-law i.e my client elder daughter husband Sri Thogalla Sagar teacher fraudulently make registration as joint sale deed and now he and his second wife namely Smt. Thogalla Premalatha trying to alienate that said above property to third parties, for which my client going to file cancellation of sale deed and criminal case against the said Sri Thogalla Sagar teacher and his second wife namely Smt. Thogalla Premalatha, hence it is cautioned and warned to the general public not to deal any kind of the transaction regarding the said schedule property if doing so it will be their own risk and cost and will be prosecuted by law and all the transaction will become null and void. If any person or persons needed further clarification, please contact undersigned to the below mentioned address and contact number.

**M/s. ADITYA LAW FIRM**
**LAXMIKANTHAM T VUKKALKAR**
**PAWAN T VUKKALKAR**
**MANOJ T VUKKALKAR**
**VINAY T VUKKALKAR**
**KARTHIK T VUKKALKAR**
**Advocates**
H.No: 3-112/6/3, Bheem Reddy Nagar Colony, Boduppal, Uppal Depot, Hyderabad, Telangana-500 092, **9704829022.**

# పాఠశాలకు కుర్చీల వితరణ

- మిత్రుడి కుటుంబానికి రూ.70వేల సాయం



కుటుంబానికి డిపాజిట్ బాండ్ అందిస్తున్న స్నేహితులు

ముప్కాల్, మే 8: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరం విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులందరూ కలిసి పాఠశాలకు 10 కుర్చీలను అందజేశారు. తన మిత్రుడు బుస్సాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ గతంలో మృతి చెందడంతో మృతుడి కూతురు పేరున సుకన్య సమృద్ధి యోజన పథకం కింద రూ.70వేల రూపాయలు పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. డిపాజిట్ పత్రాలను తన స్నేహితుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాజేందర్, రాము, రాజేశ్వర్, వసంత్, సాగర్, శిరీష, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

ముప్కాల్/బోధన్ రూరల్/కోటగిరి, మే8: పంటల్లో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, అవసరం మేరకే రసాయనాలను వినియోగించి భూసారాన్ని కాపాడాలని ప్రాంతీయ వరి పరిశోధన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్త కల్పన అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా గురువారం కొత్తపల్లి గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రసీదులను తీసుకొని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని అన్నారు. సాగు నీటిని ఆదా చేసి భావితరాలను అందించాలని కోరారు. కార్యక్రంలో మోర్తాడ్ మండల వ్యవసాయాధికారి హరీశ్, బాల్కొండ నియోజకవర్గ ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి వినాయక్, వ్యవసాయ విస్తరణాధికారి నరేశ్ పాల్గొన్నారు. బోధన్ మండలంలోని సిద్దపూర్ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ శరత్, సహ వ్యవసాయ అధికారి అలీమ్ అహ్మద్, బోధన్ మండల వ్యవసాయ అధికారి సంతోష్‌నాయక్, శాస్త్రవేత్తలు స్వప్న, రాజ్‌కుమార్, ఏఈవో ముజామిల్ తదితరులు పాల్గొన్నారు.

**పంట మార్పిడితోనే అధిక దిగుబడులు**

కోటగిరి మండల కేంద్రంలోని చావిడి వద్ద రైతులకు పంట సాగు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రాంతీయ వరి పరిశోధన స్థానం రుద్రూర్ శాస్త్రవేత్త డాక్టర్ రమ్య రాథోడ్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జయప్రకాశ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, ఏవో రాజు, ఏఈవోలు ఆస్మబేగం, గౌస్, రైతులు పాల్గొన్నారు.

## మృతదేహం వెలికితీత.. పూడ్చి వేసిన చోటే వద్దే పోస్టుమార్టం

నవీపేట, మే 8: ఆశనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఓ మృతదేహాన్ని అధికారులు వెలికితీసి పూడ్చి వేసిన వద్దనే గురువారం పోస్టు నిర్వహించారు. స్థానికుల కథనం మేరకు మండలంలోని ఆశనగర్ కాలోనికి చెందిన సయ్యద్ యూసుఫ్(58) బినోలా సమీపంలోని దర్గా వద్ద ముల్లంగిరిగా పని చేస్తాడు. యూసుఫ్ ఏప్రిల్ 25న మృతి చెందారు. అదే రోజు కుటుంబీకులు అంత్యక్రియాలు నిర్వహించారు. మృతుడి కుమారుడు తన తండ్రి మృతిపై అనుమానాలున్నాయని, ఆశనగర్‌కు చెందిన భీమ్ అనే వ్యక్తి పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని కర్రతో కొట్టడంతో మృతి చెందాడని పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. దీంతో గురువారం తహసీల్దార్ వెంకటరమణతో కలిసి ఎస్సై వినయ్ మృతదేహం పూడ్చి వేసిన చోటకు వెళ్లి మృతదేహాన్ని వెలికి తీయగా జిల్లాకు చెందిన వైద్యుడు పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ పేర్కొన్నారు.

## సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

భీమ్‌గల్, మే 8: వివిధ తోటల పెంపకానికి ఉద్యాన వన శాఖ ద్వారా సబ్సిడీ కల్పిస్తున్నట్లు మండల ఉద్యానవన శాఖ అధికారి జిట్ట రోహిత్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని దేవన్‌పల్లి, కారేపల్లి గ్రామాల్లో ఉద్యానవన శాఖ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. పండ్ల తోటల సాగులో ప్రతి హెక్టారుకు మామిడికి రూ.19200, జామకు రూ.19200, అరటికి రూ.16800, బొప్పాయికి రూ.7200, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ.65000, కూరగాయల సాగులో ప్లాస్టిక్ మల్చింగ్ వేసుకునే రైతుకు రూ. 16000 సబ్సిడీ రూపంలో నగదును ఇవ్వనున్నట్లు తెలిపారు. తీగజాతి కూరగాయల సాగు కోసం శాశ్వత పందిళ్ల నిర్మాణానికి రూ. లక్ష సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూల మొక్కల సాగు కోసం ప్రతి ఎకరాకు రూ.8000 చొప్పున నగదు రూపంలో సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. బిందు, తుంపర్ల సేద్య పరికరాల కోసం ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ రైతులకు 90 శాతం, ఓసీ రైతులకు 5 ఎకరాల వరకు 90 శాతం, పెద్ద రైతులకు 80 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ. 10500 నగదు రాయితీ రూపంలో నాలుగేండ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉద్యానవన శాఖ అధికారిని సంప్రదించాలని సూచించారు.

## రైతులకు టార్పాలిన్ల పంపిణీ

ముప్కాల్, మే8: మండలంలోని వేంపల్లి గ్రామంలో గురువారం చిన్న సన్నకారు రైతులకు నాయకుడు సంతోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టార్పాలిన్లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ..రానున్న రోజుల్లో రైతులకు అండగా ఉంటూ మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామంలోని రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు తనవంతుగా టార్పాలిన్లను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాకేశ్, ముత్యం శ్రీనివాస్, శేఖర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు

ఆర్మూర్‌టౌన్, మే8: పట్టణంలోని పెర్కిట్ చౌరస్తా వద్ద, అంగడి బజార్, ఆర్టీసీ బస్టాండ్‌లో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తనిఖీ చేశారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు గుర్తించడానికి స్నిపర్ డాగ్ సహాయంతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

## నిజాయితీ చాటిన మున్సిపల్ జవాన్

- రూ.లక్ష విలువైన సెల్‌ఫోన్‌ను యజమానికి అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న మున్సిపల్ జవాన్ గాబ్రియేల్

శక్కర్‌నగర్, మే 8: బోధన్ మున్సిపాలిటీలో జవాన్‌గా విధుల నిర్వహిస్తున్న గాబ్రియేల్ తన నిజాయితీని చాటుకున్నాడు. గురువారం విధులో భాగంగా బోధన్‌లో రోడ్డుపై వెళ్తుండగా అతనికి రోడ్డుపై ఐఫోన్ కనిపించింది. ఎవరైనా ఫోన్‌కు సంబంధించిన వ్యక్తులు వస్తే వారికి అప్పగించవచ్చని వేచి చూశాడు. సుమారు అరగంట వరకు ఎవరూ రాకపోవడంతో ఆయన సెల్‌ఫోన్‌ను బోధన్ పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ వెంకట నారాయణకు అప్పగించాడు. ఆయన ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్ల ఆధారంగా అది స్నేహిత్ అనే వ్యక్తిదని గుర్తించారు. బాధితుడిని పిలిపించి ఫోన్‌ను పోలీసుల సమక్షంలో గాబ్రియేల్ అప్పగించాడు. సుమారు రూ.లక్ష విలువైన ఫోన్‌ను తనకు అప్పగించడంపై గాబ్రియేల్‌కు, పోలీసులకు స్నేహిత్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.